దోమల మోత.. ప్రజల వేత

- దుర్గంధంతో విజృంభిస్తున్న దోమలు
- రోగాలబారిన ప్రజలు
- ఫాగింగ్ చేయాలంటున్న స్థానికులు
- విస్మరిస్తున్న అధికారులు


చెత్త పేరుకుపోవడంతో దోమలకు ఆవాసంగా మారిన బండ్లగూడ చెరువు

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని కొత్తపేట, నాగోలు డివిజన్‌తో పాటు పలు ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. సాయంత్రం అయిందంటే చాలు దోమల విజృంభణతో తట్టుకోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అసలే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో దోమకాట్లతో రోగాలబారిన పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకున్న పాపాన లేదని కాలనీ సంక్షేమ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –నాగోలు

పార్కుల్లో సైతం..

మూసీ పరీవాహక ప్రాంతమైన కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యనగర్, న్యూమారుతీనగర్, విద్యుత్ నగర్, జనప్రియ క్వాటర్స్, సమతాపురికాలనీ, నాగోలు డివిజన్ పరిధిలోని మమత నగర్ కాలనీ, సాయిరాం నగర్‌కాలనీ, జైపురి కాలనీ, వెంకటరమణ కాలనీ. బండ్లగూడ చెరువు పరిసర ప్రాంత కాలనీ, ఫతుల్లాగూడ పరిసర ప్రాంతాల్లో సైతం దోమల వ్యాప్తితో ఇళ్లలో ఉండలేని పరిస్థితి, సీనియర్ సిటిజన్స్, మహిళలు, పిల్లలు కొద్దిసేపు పార్కుల్లో గడుపుదామంటే దోమల వ్యాప్తితో ఎక్కువ సేపు గడపలేక పోతున్నామంటున్నారు. సా.6 తర్వాత అధికారులు ఆయా కాలనీలను సందర్శిస్తే పరిస్థితి అర్థమవుతుందంటున్నారు.

కానరాని ఫాగింగ్

జీహెచ్‌ఎంసీలో దోమలు నివారించే ఎంటమాలజీ విభాగం ఉందా ? ఉన్న కూడా ప్రయోజనం లేకుండా ఉందని ఆయా కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమకాటు కారణంగా డెంగీ, మలేరీయా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నప్పటికీ సంబంధిత జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్‌పై దృష్టి సారించలేకపోవడంపై కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమలు అధికంగా ఉన్నాయని పలుమార్లు జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫాగింగ్ చేసేందుకు ఎవరూ రావడం లేదని దోమకాటుకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని వాపోతున్నారు. విష జ్వరాలతో పాటు చర్మంపై దద్దుర్లు రావడం వంటి సమస్యతో బాధపడుతున్నామంటున్నారు. ఇంత జరుగుతున్నా ఫాగింగ్‌పై అధికారులు దృష్టి సారించకపోవడం విచారకరమని విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కాలనీలో ఉండలేని దుస్థితి..



సాయంత్రం దోమల వ్యాప్తితో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. సీనియర్ సిటిజన్స్, మహిళలు, పిల్లలు బయటకు రాలేకపోతున్నారు. సాయంత్రం 6 తర్వాత కాలనీలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి, కొత్తపేట మూసీ పరీవాహక ప్రాంతం కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు..ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దోమల నివారణ చర్యలు తీసుకోవాలి.

–శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌నగర్

ఫాగింగ్ చేయాలి



నాగోలు డివిజన్ పరిధిలోని మమతనగర్, మల్లికార్జుననగర్, జైపురికాలనీ ఇతర ప్రాంతాలలో దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీ వాసులు దోమలతో ఇబ్బందులు పడుతున్న ఎంటమాలజీ విభాగం అధికారులు ఫాగింగ్‌పై దృష్టి పెట్టకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఆయా కాలనీల్లో పర్యటించి ఫాగింగ్ చేసేలా చర్యలు చేపట్టాలి.

– శ్రీనివాస్, బండ్లగూడ

పని చేయని బ్రెయిలీ ప్రెస్ ప్రింటింగ్ మిషన్

చాదర్‌ఘాట్: రాష్ట్రంలోని ఏకైక బ్రెయిలీ ప్రింటింగ్ ప్రెస్ మిషన్ మరమ్మతుకు రావడంతో బుక్స్ ప్రింటింగ్ సరఫరా నిలిచిపోయింది. ఒకటో తరగతి నుంచి 10 వరకు బ్రెయిలీ విద్యార్థులకు పుస్తకాల సరఫరా కావాల్సి ఉండగా మిషన్ మరమ్మతుల రావడంతో అటు విద్యార్థులు ఇటు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని త్వరలోనే మరమ్మతులు చేసి పుస్తకాల సరఫరా చేస్తామని బ్రెయిలీ ప్రెస్ మేనేజర్ రమేష్ తెలిపారు.


బ్రెయిలీ ప్రింటింగ్ మిషన్

ఆక్రమణలపై వినతి

చంపాపేట: కబ్జాదారుల చెరల్లోని చెరువులను కాపాడాలని చంపాపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అలె వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం ఆయన హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి చంపాపేట, హస్తినాపురం డివిజన్‌లలో కబ్జాకు గురైన కుంటలు, బైరామల్‌గూడ, చేపల చెరువు వివరాలను అందజేశారు.


వినతిపత్రం ఇస్తున్న వెంకటరెడ్డి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.17, వంకాయ రూ.28, బెండ రూ.31, పచ్చిమిర్చి రూ.33, కాకరకాయ రూ.26, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.16, క్యారెట్ రూ.55, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.50, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.28, బీన్స్ రూ.65, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి


మాట్లాడుతున్న పాండురంగా చారి

నాగోలు: రాష్ట్రంలో సమగ్ర కులగణన తక్షణమే ప్రారంభించి కామారెడ్డి డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగా చారి డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రాములు, సహాయ కార్యదర్శి కొప్పు యాదయ్యలో కలిసి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందే 42 శాతం రిజర్వేషన్లను పెంచాలన్నారు. కులసంఘాలు, బీసీ సంఘాలు, రాజకీయ పార్టీలు, కలిసొచ్చే ప్రతి ఉద్యమకారులతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అదనపు గదుల ప్రారంభం


అదనపు గదులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధి చంద్రపురికాలనీలోని తపోవనం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం భవనం అదనపు గదులను బుధవారం కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ సొంతంగా విరాళాలు రూ.6.5 లక్షలతో అదనపు గదుల నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు.ప్రభుత్వం నుంచి అందాల్సిన సంక్షేమ ఫలాలు రావడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, వేమారెడ్డి, రామ్‌రెడ్డి, సోమిరెడ్డి, రుద్రయాదగిరి, ప్రసాద్ పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలపై 436 మందితో స్పెషల్ డ్రైవ్


మాట్లాడుతున్న హేమంత్ కేశవ్ పాటిల్, రజనీ


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీసీ తిప్పర్తి యాదయ్య

- మూడేళ్లుగా డెంగీ మరణాలు లేవు
- జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నామని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్ అన్నారు. బుధవారం జోనల్ కమిషనర్ కార్యాలయంలో సీనియస్ ఎంటమాలజీ అధికారి రజనీతో కలిసి వివరాలు వెల్లడించారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దోమల నివారణకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి దోమకాటు వల్ల వచ్చే డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో ఎలాంటి మరణాలు లేవన్నారు. దోమల నిర్మూలనకు చెరువుల, కుంటల వద్ద ఎంటమాలజీ సిబ్బందితో కలిసి గుర్రపు డెక్కలను తొలగించి దోమలు వృద్ధి చెందకుండా పిచికారీ చేస్తున్నామని పేర్కొన్నారు. కుండీలు, కూలర్లు, తొట్టిలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సుమారుగా 436 మంది సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జోనల్ పరిధిలో తాము తీసుకుంటున్న చర్యలతో దోమలతో వచ్చే జ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని తెలిపారు. గత సంవత్సరం ఇదే నెలలో దోమలతో 76 డెంగీ కేసులు నమోదు కాగా ఇప్పటి వరకు 70 కేసులు మాత్రమే వచ్చాయన్నారు.

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో..

హయత్‌నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరాబాద్, నాగోలు, హయత్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్లలో బుధవారం సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో ప్రజలకు అవగహన కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరు ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడ కూడా నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

2న డయల్ యువర్ డీసీ

చాదర్‌ఘాట్: డెంగీ, జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సెప్టెంబర్ 2న డయల్ యువర్ డీసీ కార్యక్రమాన్ని 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డీసీ జయంత్ తెలిపారు. సమస్యలను 99899 30410 ద్వారా తెలుపాలని ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు.

31న జెడ్సీతో ఫోన్ ఇన్

చైతన్యపురి: వ్యాధుల నియంత్రణ చర్యల కోసం శనివారం ఉదయం 10.30 నుంచి 11.30 వరకు డయల్ యువర్ జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని ప్రజలు శానిటేషన్ సమస్యలు, అంటువ్యాధుల నియంత్రణకు సంబంధించిన సమస్యలను 9154671587 నంబర్‌కు ద్వారా తెలుపవచ్చన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ప్రజలు దోమల బారిన పడి ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి సోకే ప్రమాదం ఉందని ఈ వ్యాధిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. బుధవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని శివసాయినగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్ సుజాతనాయక్‌ను కలిసి కాలనీలో ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కాలనీలో శుభ్రత పాటిచాలని రోడ్ల వెంబడి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం


బస్తీ దవాఖానాను సందర్శించిన డీసీ శైలజ

సైదాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ శైలజ సూచించారు. బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ సుబ్రహ్మణ్యనగర్ కాలనీలోని బస్తీ దవాఖానాను ఆమె జీహెచ్‌ఎంసీ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తమ ఇంటి పరిసరాలలో దోమలు వృద్ధి చెందకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. డెంగీ తదితర వ్యాధుల బాధితులు పెరుగుతున్నందున బస్తీ దవాఖానాలోని వైద్య సిబ్బంది ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కాలనీలోని కమ్యూనిటీహాల్‌ను పరిశీలించారు. డీసీ వెంట ఎస్.ప్రసాదరావు ఉన్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు


మెట్రో స్టేషన్‌లో డీసీపీ, ఏసీపీ

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి బీడీ టీం, డాగ్‌స్క్వాడ్, సిబ్బందితో కలిసి దిల్‌సుఖ్‌నగర్, రాజీవ్‌చౌక్, మెట్రో స్టేషన్ ప్రాంతాల్లో పర్యటిస్తూ వాహనాల తనిఖీలు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని షాపింగ్ మాల్స్ యజమానులకు సూచించారు.



'పారా' క్రీడాకారిణికి అభినందన



చాదర్‌ఘాట్: పారిస్‌లో మొదలైన పారా ఒలంపిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో పాల్గొనటానికి రాష్ట్రం నుంచి వెళ్తున్న జీవన్‌జీ దీప్తికి వికలాంగుల సంక్షేమ సంస్థ చైర్మన్ వీరయ్య అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ పారా క్రీడాకారిణి జీవన్‌జీ దీప్తి ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి దేశానికి పేరు తేవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


సుభాష్‌చందర్జీకి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

సైదాబాద్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ అన్నారు. బుధవారం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకొని సైదాబాద్‌లోని ఆయన నివాసానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని దేశ ప్రధాని కార్యాలయం (పీఎంఓ) నుంచి ప్రధాని మోదీ పేరుతో ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సందేశం పంపించారు. హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్ ద్వారా సుభాష్‌చందర్జీకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసేవతోనే రాజకీయ జీవితంలో సంతృప్తి లభిస్తుందన్నారు.

అష్టలక్ష్మి దేవాలయంలో ర్యాంప్ ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో అన్నపూర్ణశాలలో అన్నప్రసాదశాల ర్యాంప్‌ను కంచి కామకోటి పీఠం ధర్మాధికారి శ్రీమాన్ జైశంకర్ బాలగోపాల్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా ప్రారంభించారు. అష్టలక్ష్మి అక్షయ ట్రస్ట్ మొదటి అంతస్తు ర్యాంప్ నిర్మాణం దివంగత గౌరిశెట్టి లీలావతి జ్ఞాపకార్థం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులచే నిర్మాణం చేసినట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధా ధీరజ్‌రెడ్డి, రంగా నరసింహ గుప్తా ట్రస్ట్ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంపజగన్, కోశాధికారి అంజయ్యగుప్తా పాల్గొన్నారు.


ర్యాంపును ప్రారంభిస్తున్న శ్రీమాన్ జై శంకర్ బాలగోపాల్, దయానంద్ గుప్తా

అక్రమ నిర్మాణం కూల్చివేత

దిల్‌సుఖ్‌నగర్: నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయం ఆర్చి పక్కన నిర్మిస్తున్న అక్రమ నిర్మాణం గురించి స్థానికులు టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ సరూర్‌నగర్ టౌన్ ప్లానింగ్ అధికారులు పోలీసు సిబ్బందితో వచ్చి భవనంపై అదనంగా అక్రమంగా నిర్మాణం చేపట్టిన రేకుల షెడ్డును కూల్చివేశారు. ఈ భవనం రెండు వైపులా రోడ్లను ఆక్రమించి నిర్మాణం పనులు చేపట్టారని ఫిర్యాదు చేసినప్పటికీ కేవలం రేకులతో నిర్మించిన షెడ్డును మాత్రమే కూల్చడం ఏంటని ఫిర్యాదుదారులు అధికారుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు నిర్మాణదారుడు అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన బిల్డర్ కావడంతో అధికారులు చూసీ చూడనట్లుగా వదిలేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కూతురి కాపురంపై బెంగతో తండ్రి ఆత్మహత్య


ప్రభాకర్‌రెడ్డి (ఫైల్)

ఇబ్రహీంపట్నం రూరల్: కుమార్తె కాపురంపై బెంగతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. జిల్లెలగూడకు చెందిన సిద్దిపేట ప్రభాకర్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆయన రెండో కూతురు విడాకులు తీసుకుని కొంత కాలంగా పుట్టింట్లో ఉంటోంది. ఈమె కొడుకు ఎవరి వద్ద ఉండాలనే విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. మనవడు దూరమవుతాడేమో అని ప్రభాకర్‌రెడ్డి(60) మనస్తాపానికి గురై బుధవారం అంజిరెడ్డి వెంచర్‌లోని కంటైనర్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య అండాలు జిల్లెలగూడలో బీజేపీ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. బిడ్డ కాపురంపై మనోవేదనకు గురి కావడంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు అండాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఓపెన్‌జిమ్ పనులకు శంకుస్థాపన


పనులకు శంకుస్థాపన చేస్తున్న చింతల అరుణ

నాగోలు: ఆరోగ్యం పట్ల అందరూ జాగ్రత్తలు తీసుకోవాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ రెడ్డి సూచించారు. బుధవారం నాగోలు డివిజన్ పరిధిలోని సహాభావన టౌన్‌షిప్ సీ–బ్లాక్‌లో నూతన నిర్మించే ఓపెన్ జిమ్ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానికులు వివిధ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆటో ఢీకొని ప్రభుత్వ ఉద్యోగి మృతి

సైదాబాద్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఎస్‌బీహెచ్ కాలనీలో నివసించే టి.బాబా దయాకర్‌జీ (60) అర్బన్‌ల్యాండ్ సీలింగ్‌లో సర్వే ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకొని ఇంటికి వస్తూ గడ్డిఅన్నారం ప్రధాన రహదారిపై మార్నింగ్ స్టార్ స్కూల్ వద్ద రోడ్డు దాటుతుండగా అతివేగంతో నిర్లక్ష్యంగా వచ్చిన ఆటో ఢీకొట్టి వెళ్లి పోయింది. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో దయాకర్‌జీని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రోడ్లపై చెత్త వేయొద్దు

లింగోజిగూడ: రోడ్లపై చెత్తను వేయకుండా చర్యలు తీసుకుంటామని, దోమల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో జీహెచ్‌ఎంసీ సిబ్బందితో కలిసి ఆయన ఇంటింటికి తిరిగి దోమల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసర ప్రాంతాలలో నీటి నిలువ ప్రాంతాలను గుర్తించి వెంటనే శుభ్రం చేసుకోవాలన్నారు. డివిజన్‌లోని ప్రతి కాలనీలో దోమల నివారణ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంటమాలజీ ఏఈ మనమ్మ, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, నరేష్ ఉన్నారు.


అవగాహన కల్పిస్తున్న రాజశేఖర్‌రెడ్డి